సాక్షి
సంగారెడ్డి

బుధవారం। 17। జూలై। 2024

సీఎం సమీక్షలో కలెక్టర్, ఎస్పీ

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లు, కమిషనర్లు, ఎస్పీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి నుంచి కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేష్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో జరిగే అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు.

- సంగారెడ్డి టౌన్

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్



న్యూస్‌రీల్

విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి టౌన్: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, శ్రీతేజ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు గృహహింస, బాల్య వివాహం, పోక్సో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గురుకుల పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉంచడం తోపాటు పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృపానిధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చేర్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, టీచర్లు

పటాన్‌చెరు టౌన్: పిల్లల అంగన్‌వాడీల్లో చేర్పించడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు ఆటపాటలతో విద్య నేర్పిస్తారని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్, పాశమైలారం అంగన్‌వాడీల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సూపర్‌వైజర్ సల్మా, టీచర్లు పాల్గొన్నారు.


మహిళా హక్కులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త పల్లవి

పటాన్‌చెరు: మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి సూచించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ఉన్న సేవలపై మంగళవారం మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ ప్రోగ్రాంలో భాగంగా మండల పరిధి ఇస్నాపూర్, పాశమైలారం, అంగన్‌వాడీ సెంటర్లలో, శక్తి సదన్ బీరంగూడలో అవగాహన కల్పించారు. అదేవిధంగా సఖి కేంద్రం సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఉపయోగాలను, శక్తిసదన్ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సల్మా, శక్తిసదన్ ఇన్‌చార్జి సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, విశాల, సరిత పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచలోని నల్లపోచమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. అమ్మవారికి కానుకల రూపంలో రూ.12,00032 ఆదాయం వచ్చినట్లు ఈఓ విభూతి శివరుద్రప్ప తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా రాజేశ్వర్, జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, అధికారులు శివానంద్, భుజంగం, ఏఎస్ఐ తులసీరామ్, నరసింహారెడ్డి, శ్రీకాంత్ స్వామి, సిద్దు స్వామి, నాగయ్య స్వామి, ప్రవీణ్ కుమార్ స్వామి, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుకు ప్రోత్సాహం

సంగారెడ్డి టౌన్: పంట మార్పిడి చేసి ఎకరానికి లక్షరూపాయల నికర ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి సోమేశ్వర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆయిల్ పాం మెగా ప్లాంటేషన్ మేళాను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నీటి వసతి కలిగిఉన్న ప్రతీ రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెక్స్ట్ ఎవరు..?

ఒక్కొక్కరుగా కారు దిగుతున్న ఎమ్మెల్యేలు

- కాంగ్రెస్ గూటికి చేరేవారిపై సర్వత్రా చర్చ
- రాష్ట్రంలో అందరికంటే ముందే రేవంత్‌ను కలిసిన ఆ నలుగురు
- గతంలో కలకలం రేపిన జగ్గారెడ్డి వ్యాఖ్యలు
- ఉమ్మడి జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. తాజాగా ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ క్రమంలో త్వరలోనే కారు దిగే జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యే ఎవరు..? హస్తం పార్టీలో చేరేందుకు ఏ ఎమ్మెల్యే సిద్ధమయ్యారు..? ఇప్పుడు ఇదే అంశంపై జిల్లా రాజకీయవర్గాల్లో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ వరుసలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ముందుంటారా..? సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ త్వరలోనే బీఆర్ఎస్‌ను వీడుతారా..? నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గులాబీ పార్టీకి గుడ్‌బై చెబుతారా.? ఇలా ఎమ్మెల్యేల జంపింగ్‌లపై ఊహాగానాలు మొదలయ్యాయి.

గత అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ, ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం గులాబీ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 11 అసెంబ్లీ స్థానాలకు గాను ఏడు చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించిన విషయం తెలిసిందే. అధికారం లేకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు కారు దిగుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే జిల్లాకు చెందిన గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడిన విషయం విదితమే. గూడెం బాటలోనే త్వరలో మరో ముగ్గురు గులాబీ పార్టీకి గుడ్‌బై చెబుతారని చర్చ జరుగుతోంది.

కొత్త ప్రభాకర్‌రెడ్డికి...

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికపైనా స్థానికంగా చర్చ జరుగుతోంది. ట్రాన్స్‌పోర్టు, రియల్ వ్యాపారాలు ఉన్న ప్రభాకర్‌రెడ్డికి ఇటు కాంగ్రెస్ రాష్ట్ర అగ్రనేతల సమీప బంధువులతో వ్యాపార సంబంధాలున్నాయి. పలు ప్రాజెక్టుల్లో భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన కాంగ్రెస్ గూటికి చేరే జాబితాలో కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. గతంలో జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిని కలిసేందుకు చొరవ తీసుకుంది కూడా కొత్త ప్రభాకర్‌రెడ్డేనని అప్పట్లో చర్చ జరిగింది. తన పార్టీ మార్పుపై ఎమ్మెల్యే కొట్టిపారేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకే నిధుల్లేవు.. తాము వెళ్లి చేసేదేముంటుందని ప్రభాకర్‌రెడ్డి తన సన్నిహిత అనుచరులతో పేర్కొన్నట్లు తెలిసింది.

సునీతారెడ్డి, మాణిక్‌రావు..

కాంగ్రెస్‌లో చేరే వారి జాబితాలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేరు కూడా ఉంటుందని చర్చ జరుగుతోంది. ఆమెకు కాంగ్రెస్ పార్టీతో సన్నిహిత సంబంధాలున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు. సునీతారెడ్డి స్థానికంగా ప్రొటోకాల్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నర్సాపూర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వంటి నేతలు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇదే బాటలో సునీతారెడ్డి కూడా వెళ్లే అవకాశం ఉందని ప్రచారం జోరందుకుంది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావును కూడా పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ నియోజకవర్గ కీలక నేత గిరిధర్‌రెడ్డి ద్వారా ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో టికెట్ ఇచ్చి, డబ్బులు ఇచ్చి గెలిపించుకున్న బీఆర్ఎస్‌ను వీడేందుకు తన మనస్సు ఒప్పడం లేదని మాణిక్‌రావు తన సన్నిహితులతో పేర్కొంటున్నారు. కానీ ఆయన కుటుంబసభ్యులు కాంగ్రెస్‌లో చేరాలని ఒత్తిడి తెస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు

ముందుగా సీఎంను కలిసింది ఆ నలుగురే...

సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్రంలో అందరికంటే ముందుగా వెళ్లి కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం. కొత్త ప్రభాకర్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డి, కొనింటి మాణిక్‌రావులు ఈ ఏడాది జనవరిలోనే రేవంత్ నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ సమస్య తలెత్తుతోందని, దాన్ని వివరించేందుకే తాము సీఎంను కలిశామని ఈ నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ భేటీపై బీఆర్ఎస్ అధినాయకత్వానికి కూడా వారు వివరణ ఇచ్చుకున్నట్లు తెలిసింది. ఇప్పుడు ఈ నలుగురిలో ఒకరైన గూడెం కాంగ్రెస్‌లో చేరడంతో మిగిలిన వారు కూడా త్వరలోనే ఆ పార్టీ కండువాలు కప్పుకుంటారనే ప్రచారం జరుగుతోంది.

జగ్గారెడ్డి వ్యాఖ్యలు చర్చనీయాంశం

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక అంశంపై మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. చింతా ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఏమైనా అభ్యంతరమా? అని తనతో మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారని స్వయంగా జగ్గారెడ్డి ఇటీవల వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో కాంగ్రెస్‌లో చేరే వారిలో చింతా ప్రభాకర్ కూడా ఉండే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాజీ మంత్రి హరీశ్‌రావుకు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన చింతా పార్టీని వీడే ప్రసక్తే ఉండదని ఆయన అనుచరులు చెప్పుకొస్తున్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

తెలంగాణ యాంటీ నేరోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్

సంగారెడ్డి: మత్తు వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రతీ ఒక్కరు డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ యాంటీ నేరోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్ సూచించారు. మంగళవారం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని హితబోధ చేశారు. డీఎస్పీ సత్యయ్య గౌడ్ మాట్లాడుతూ కొందరు మత్తులో నేరాలకు పాల్పడి జైలు జీవితాలను అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జోగిపేట సీఐ అనిల్ కుమార్, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ వై.రాఘవేంద్రరావు, మెకానికల్ విభాగాధిపతి ప్రసన్నలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

ఒత్తిడి లేదు.. షరతుల్లేవ్

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మార్పు
- బీఆర్ఎస్ అగ్రనేతలు నిండు మనసుతో ఆశీర్వదించారు. : ఎమ్మెల్యే గూడెం



పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తనపై ఏ ఒత్తిడి లేదని, ఎలాంటి షరతులు లేవని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి 11నెలలవుతున్నా ఇప్పటివరకు అభివృద్ధి జరగలేదు. అంతకు ముందు ఈ ప్రాంతానికి విడుదలైన రూ.475 కోట్లు వివిధ కారణాలతో నిలిచిపోయాయని చెప్పారు. సబ్ రిజిస్ట్రేషన్, ఆర్డీఓ తోపాటు మరికొన్ని కార్యాలయాలు పాలిటెక్నిక్, ప్రాజెక్టులకు సంబంధించిన జీఓలు ఉన్నాయని, వాటి అమలు కోసమే కాంగ్రెస్‌లో చేరాల్సి వచ్చిందన్నారు. ఒకసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుల విషయంలో అడ్వకేటు నిరంజన్‌రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లిన మాట వాస్తవమేనని, కానీ బీజేపీలో చేరడానికి కాదని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడు నియోజకవర్గ స్థాయి పెద్ద నాయకులంతా ఉన్నారని, ఒక్క కాట శ్రీనివాస్ తప్ప అందరూ వచ్చారని తెలిపారు. కార్యకర్తలంతా సంతృప్తిగా ఉన్నారని, అందరినీ కలుపుకొనిపోతా అని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ముఖ్య నాయకులు హరీశ్, కేటీఆర్ అందరితోనూ మాట్లాడానని, వారు నిండు మనస్సుతో కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. వారు ఇచ్చిన అవకాశంతో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు వారికి ధన్యవాదాలు చెప్పి మరీ కాంగ్రెస్‌లో చేరినట్లు వివరించారు.

ఆ తప్పను సరిదిద్దుకున్నా..

- అప్పట్లో బీఆర్ఎస్‌లో చేరడం తప్పిదమే..
- రాజకీయ స్వార్థం ఏమీలేదు
- పటాన్‌చెరు నేత గాలి అనిల్‌కుమార్



పటాన్‌చెరు: అప్పట్లో తాను బీఆర్ఎస్‌లో చేరడం తప్పుడు నిర్ణయమేనని కాంగ్రెస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. దాన్ని ఇప్పుడు సరిదిద్దుకున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరడంలో ఎలాంటి రాజకీయ స్వార్థం లేదన్నారు. ''ఆ పార్టీతో గతంలో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఎన్నికలకు ముందు వివిధ రాజకీయ కారణాలతో బీఆర్ఎస్‌లో చేరి జహీరాబాద్ ఎంపీగా పోటీ చేశా. అధికార పార్టీలో చేరాలనే యావ లేదు. కాంగ్రెస్ రాష్ట్ర నేతల పిలుపు మేరకు ఆ పార్టీలో చేరాను. అలాగని బీఆర్ఎస్‌లో నాకు ఎలాంటి చేదు అనుభవాలు లేవు. మొన్నటి ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్‌లోనే కొనసాగిన విషయం తెలిసిందే కదా'' అని అనీల్‌కుమార్ మంగళవారం 'సాక్షి'కి వివరించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ నేతల సూచనల మేరకు కాంగ్రెస్ కార్యకర్తగా క్రియాశీలకంగా వ్యవహరిస్తానని చెప్పారు. పార్టీ మారుతానని తాను కూడా ఊహించ లేదన్నారు. అయితే ఆ పార్టీ నాయకత్వంతో ఉన్న సత్సంబంధాలే తనను కాంగ్రెస్ చేరేలా చేశాయని చెప్పారు. ఎమ్మెల్సీ, లేదా ఇతర కార్పొరేషన్ పదవులేవీ ఆశించడం లేదన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పదవులు వస్తాయని చెప్పారు. అయితే తనకు పార్టీ నుంచి హామీలు, ప్యాకేజీలు ఏమీ అందలేదని ఆయన 'సాక్షి'కి తెలిపారు. తన అనుచరులు సంతృప్తితో ఉన్నారని వివరించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు ఇప్పించండి

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించే విషయంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆయన ఛాంబర్‌లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఏడు నెలలుగా చెక్కులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 900కు పైగా చెక్కులకు సంబంధించి గడువు తీరిపోయిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, జహీరాబాద్ ఆర్డీఓల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు చేపట్టడం లేదన్నారు.



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి పారిశ్రామిక వాడ రోడ్లను మంగళవారం సీఐటీయూ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ మాట్లాడుతూ.. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, ఇండస్ట్రియల్ ఏరియాలో స్ట్రీట్‌లైట్లు కూడా లేవన్నారు. దీంతో రాత్రివేళ డ్యూటీకి వెళ్లేవారు నరకం చూస్తున్నారని వాపోయారు. వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు.

ఇప్పుడేం చేద్దాం?

అయోమయంలో బీఆర్ఎస్ శ్రేణులు

- ఎమ్మెల్యే తోపాటు మండల నాయకులు కాంగ్రెస్‌లో చేరటంపై ఆగ్రహం
- సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు
- త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామంటున్న స్థానిక గులాబీ నేతలు

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరటంపై ఆ పార్టీ నేతలు షాక్ గురయ్యారు. తాము ఓటు వేసి గెలిపించిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వెళ్లటంతో జిన్నారం, గుమ్మడిదల మండలాల బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీ రెండు మండలాల నేతలు త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని తమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలుపుతున్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ సద్ది ప్రవీన, బీఆర్ఎస్ గుమ్మడిదల మండల అధ్యక్షులు హుస్సేన్, నాయకులు సద్ది విజయ భాస్కర్‌రెడ్డి లోపాటు పలువురు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. దీంతో స్థానిక బీఆర్ఎస్ నేతల్లో అయోమయం నెలకొంది. జిన్నారం మండలం నుంచి కేవలం మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ ఒక్కరే ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్‌లో చేరారు. పదేళ్ల పాటు పదవులు అనుభవించి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరడంపై మండల నాయకులు సోషల్ మీడియా ద్వారా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలను కాంగ్రెస్‌లో చేరాలని ప్రభాకర్ ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. అయితే గులాబీ నాయకులు ఏ నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ కలిగిస్తుంది. త్వరలోనే సమావేశమై తదుపరి నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు.

గుమ్మడిదల మండలంలోని మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులతో పాటు పలువురు ముఖ్య నేతలు ఎమ్మెల్యేతో సహా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మండల వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు నష్టమే జరిగింది. ఈ నష్టాన్ని స్థానిక నాయకులు ఎలా పూడ్చుకుంటారో చూడాలి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, నీలం మధు, ఇప్పుడు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలతో పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపడిందని చెప్పవచ్చు. కానీ ముస్ముందు వీరి మధ్య ఎలాంటి సఖ్యత ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది.



ప్రతిభ అవార్డుకు ఎంపిక



రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విశ్వ విఖ్యాత కీర్తి పురస్కారాలు 2024 సంవత్సరానికి గాను జాతీయస్థాయి మహామయూర ప్రతిభ పురస్కారానికి మండల పరిధిలోని నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ ఎంపికయ్యారు. విద్య, సామాజిక సేవా రంగాలలో 25 ఏళ్లుగా అందిస్తున్న విశిష్ట సేవలకు ఎంపిక చేసినట్లు విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సంస్థ అవార్డుల ఎంపిక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్ఆర్వీ వెంకటేష్ మంగళవారం తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 28న త్యాగరాజు గాన సభ చిక్కడపల్లి, హైదరాబాద్‌లో ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్బాబు చేతుల మీదుగా అందుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను మండల విద్యాధికారి శంకర్, నిజాంపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ, తదితరులు అభినందించారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి

వట్‌పల్లి(అందోల్): ఇందిరాక్రాంతి పథకంలో పని చేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అందోల్ నియోజకవర్గ వీఓఏల సంఘం నాయకులు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలతో వెట్టిచాకిరీ చేయిస్తూ నెలకు చాలీచాలని వేతనం ఇస్తున్నారని ఆరోపించారు. 3 నెలలకొకసారి అనెక్సర్-5 రెన్యూవల్ పద్ధతిని రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం అమలు చేయడంతో పాటు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, రమ, సుమలత, ఆంజనేయులు, మల్లన్న, నాగేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహిళా ప్రయాణికులకు బహుమతులు

నారాయణఖేడ్: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు నెలలో మూడుమార్లు లక్కీడీప్ నిర్వహించి ముగ్గురి చొప్పున ఎంపికచేసి బహుమతులను అందజేయనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. బస్సు దిగేముందు టికెట్ వెనుక భాగంలో తమ పేరు, ఫోన్ నంబరును రాసి బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్సుల్లో వేయాలన్నారు. ప్రతినెలా 16, 30, 31 తేదీల్లో లక్కీడీప్ తీయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కందుకూరు వెళ్లే ప్రయాణికులు టికెట్‌తో పాటు రిటర్న్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో ఒకేసారి బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. మంత్లీ సీజన్ టికెట్‌తో 20 రోజుల ప్రయాణ చార్జీతో 30 రోజులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇతర వివరాల కోసం 9551071134, 9676667703, 9959223170 నంబర్లలో సంప్రదించాలని డీఎం సూచించారు.

నిర్లక్ష్యం.. ప్రత్యక్షం





నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేతికి గ్లౌజులు లేకుండానే వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: ఆస్పత్రుల్లో వాడి పారేసిన పరికరాలు, వ్యర్థాలను జాగ్రత్తగా తరలించాల్సి ఉంటుంది. కానీ నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో మాత్రం అవేమీ పట్టడంలేదు. అవగాహన లేక కింది స్థాయి ఉద్యోగులు వ్యర్థాలను ఎలాంటి సేఫ్టీల వాడకుండా తీసుకెళ్తున్నారు. ఈ విషయంలో ఆస్పత్రి వర్గాల నిర్లక్ష్యం ప్రత్యక్షంగా కనిపిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో మున్సిపల్ వాహనం ద్వారా ఆస్పత్రి వ్యర్థాలను తరలిస్తుంటారు. అత్యవసర విభాగాల తోపాటు, డయాలసిస్, డెలివరీలు, కుటుంబ నియంత్రణ తదితర విభాగాల్లోని వ్యర్థాలు, వాడిన ఇతర పరికరాలను సిబ్బంది ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ఆస్పత్రి నుంచి మున్సిపల్ వాహనాల్లోకి తరలిస్తున్నారు. చేతులకు గ్లౌజులు కూడా వేసుకోవడంలేదు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా వ్యర్థాలు, పరికరాల తరలింపు వల్ల కింది స్థాయి సిబ్బంది ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ఆస్పత్రి వర్గాల నిర్లక్ష్యం తేటతెల్లమవుతుంది.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.3.50 లక్షల నగదు, మూడున్నర తులాల బంగారం అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఇంద్రేశం ఆర్కే–1 కాలనీకి చెందిన మహేశ్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14న తన స్వగ్రామం నారాయణఖేడ్‌కు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులు, బాధితుడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంట్లో బీరువాలో ఉన్న రూ.3.50 లక్షల నగదు, మూడున్నర తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించాడు. పోలీసులు ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అల్లుడిపై మామ, బావమరిది దాడి

చేర్యాల(సిద్దిపేట): భార్యని కాపురానికి తీసుకెళ్లేందుకు అత్తారింటికి వచ్చిన అల్లుడిపై మామ, బావమరిది దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు కథనం ప్రకారం.. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లికి చెందిన మహిళ వివాహం బచ్చన్నపేట మండలం పడమటికేశపురానికి చెందిన పెద్దారం జహంగీర్‌తో జరిగింది. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఆమె కాపురానికి రాకపోవడంతో మాట్లాడేందుకు శనివారం ఇక్కడికి వచ్చిన అల్లుడిపై మామ, బావమరిదితో గొడవ పడినట్లు తెలిసింది. దీంతో జహంగీర్‌పై గొడ్డలి, రాడ్డుతో వారు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డట్లు సమాచారం. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను చెప్పారు.

బాలకార్మికులతో పనులు చేయిస్తే చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): బాలకార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు హెచ్చరించారు. సంబంధిత జిల్లా శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, గులాబ్ సింగ్‌లు మంగళవారం న్యాల్‌కల్‌లో పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఒక మొబైల్ షాప్‌లో 14 ఏళ్ల బాలుడు పని చేస్తుండగా పట్టుకున్నారు. షాప్ యాజమాని రాజ్‌రెడ్డిపై బృందం సభ్యుడు హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామానాయుడు తెలిపారు. బాలలను పనిలో పెట్టుకుంటే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

తాగి వాహనాలు నడపొద్దు

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేశారు. దీంతో ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సరైనా పత్రాలు లేకుండా రోడ్డుపైకి వాహనాలు వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ ఆర్‌సీ, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ది బెస్ట్.. దుబ్బాక ఆస్పత్రి



ఈహెచ్ఎంఐఎస్ జాబితా విడుదల ● ర్యాంకు ఇచ్చిన వైద్యారోగ్య శాఖ ● హర్షం వ్యక్తం చేసిన వైద్యులు, సిబ్బంది

సాధారణ దుబ్బాక ఏరియా ఆస్పత్రి అద్భుతం సృష్టించింది. ఓపీ వైద్యసేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో పేరొచ్చింది. అందుకు కృషి చేసిన వైద్యులు, సిబ్బంది అభినందనలు అందుకుంటున్నారు. మహా మహా ఆస్పత్రులను అధిగమించి రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడమంటే మామూలు విషయం కాదు. ఈహెచ్ఎంఐఎస్ జాబితా విడుదల చేయగా వైద్య, ఆరోగ్య శాఖ ర్యాంకులను ప్రకటించింది.



ప్రభుత్వ ఆస్పత్రి

దుబ్బాక: రాష్ట్రంలోనే ఉత్తమ వైద్యసేవలు అందించడంలో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రి మరింతగా ముందడుగు వేసింది. తాజాగా తెలంగాణ (ఈహెచ్ఎంఐఎస్) వైద్య ఆరోగ్య, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ విడుదల చేసిన జాబితాలో ఉత్తమ ఓపీ వైద్యసేవల్లో దుబ్బాక ఆస్పత్రి స్టేట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఏరియా, జిల్లా ఆస్పత్రులు, సీహెచ్‌సీలతో పాటు ఉస్మానియా ఆస్పత్రితో పాటు పెద్ద హాస్పిటల్‌లు మొత్తం 102ను పరిగణలోకి తీసుకొని ఈ జాబితాను వైద్య, ఆరోగ్య శాఖ గుర్తించి ర్యాంకులను విడుదల చేసింది. జనవరి 1, 2024 నుంచి జులై 14 వరకు గణాంకాలను పరిగణలోకి తీసుకొని రూపొందించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఆస్పత్రి 78.86 శాతంతో మొదటి స్థానంలో ఉండగా దుబ్బాక ఏరియా హాస్పిటల్ 78.66 శాతంతో ఓపీ వైద్య సేవలు అందించడంతో రెండో స్థానంలో నిలిచింది.

అబా యాప్‌లో రోగుల ఆరోగ్య రికార్డులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అబా యాప్ (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ ఖాతా) ద్వారా దుబ్బాక ఆస్పత్రికి వచ్చే రోగుల రికార్డులను పొందుపరుస్తున్నారు. వైద్య సేవల కోసం వచ్చే రోగుల మొబైల్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. దీంతో రోగి ఏ ఆస్పత్రికి వెళ్లినా యాప్‌ను చూపిస్తే రోగి పరిస్థితి ఇట్టే తెలిసిపోతుంది. ఇందు కోసం హాస్పిటల్‌లో 7 మాడ్యుళ్లను సజావుగా నడుపుతున్నారు. జనవరి 1, 2024 నుంచి జులై 14, 2024 వరకు ఓపీడీ 28,990, ఈఓపీ 1,107 రోగులు కలిపి మొత్తం 30,907 మంది దుబ్బాక ఆస్పత్రికి వైద్యసేవల కోసం రాగా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ద్వారా 23,673 రోగుల ఆరోగ్య పరిస్థితిని అప్‌లోడ్ చేశారు. యాప్‌పై అవగాహన కల్పిస్తూ ప్రయోజనాలకు వివరిస్తున్నారు.


ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది హర్షం



సంతోషం వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఓపీ వైద్య సేవల్లో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవడం పట్ల మంగళవారం దుబ్బాక ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన వైద్యులు, సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయిలో పేరు రావడం గర్వకారణం



ఉత్తమ వైద్యసేవల్లో ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలో రెండో స్థానం సాధించి దుబ్బాక పేరును నిలపడం చాలా ఆనందకర విషయం. ఇప్పటికే అరుదైన సర్జరీలు, వైద్య సేవలను అందిస్తూ రాష్ట్రంలోనే మంచి పేరు సాధించింది. వైద్యులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు. సరిపడా వైద్యులు, సిబ్బంది సౌకర్యాలు లేనప్పటికీ ఉన్న వారు నిరంతరం కష్టపడి ఈ ఘనత సాధించారు.

–కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

సూపరింటెండెంట్‌ను బదిలీ చేయొద్దు

● మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్‌లకు వినతి



మాట్లాడుతున్న నాయకులు

దుబ్బాక: ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్‌ను బదిలీ చేయొద్దని పార్టీలకతీతంగా నాయకులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, కలెక్టర్ మను చౌదరిలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంగం ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ బాల్‌రెడ్డి, ఆకారం మాజీ ఉపసర్పంచ్ మహేందర్‌లు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల సర్జరీలు, వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. ఈ నియోజకవర్గం నుంచే కాకుండా ఉమ్మడి మెదక్ జిల్లా, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని చాలా గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇక్కడికే వస్తారన్నారు. అన్నివిధాలా వైద్యసేవలు అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దారన్నారు. ఆయన్ను బదిలీ చేస్తే పేదలకు వైద్యం పరంగా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. సమావేశంలో నాయకులు వరప్రసాద్, సురేశ్ తదితరులు ఉన్నారు.

సంతోషంగా ఉంది



ఓపీ వైద్య సేవల్లో దుబ్బాక ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలో సెకండ్ ప్లేస్ పొందడం చాలా సంతోషంగా ఉంది. వైద్యులు, సిబ్బంది నిరంతర సహకారంతోనే ఈ ఘనత సాధించాం. ఇంకా మెరుగైన సేవలు అందిస్తాం. ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన తమ వైద్య బృందానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

–డాక్టర్ హేమరాజ్‌సింగ్, దుబ్బాక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

మహిళ మృతదేహంతో ధర్నా

నిందితుడికి పోలీసులు కొమ్ముకాస్తున్నారని బంధువులు, గ్రామస్తుల ఆరోపణ



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు



మృతురాలు లక్ష్మి(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతిచెందగా ఇందుకు కారకుడైన యువకుడిపై కేసు పెట్టితే పోలీసులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో బంధువులు, గ్రామస్తులు ధర్నా చేపట్టారు. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారానికి చెందిన బర్లె లక్ష్మి(50), కోడలు జ్యోతి, పెద్ద కూతురు యశోదతో కలిసి 6 రోజుల క్రితం వెల్దుర్తిలో ఉంటున్న చిన్నకూతురు అనురాధ వద్దకు బయలుదేరారు. ఆటోలో ఎక్కి ఆ ప్రాంతంలో దిగి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇదే పట్టణానికి చెందిన యువకుడు.. లక్ష్మి వెనుక నుంచి వచ్చి బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో గాయాలపాలైన ఆమెను వెంటనే పక్కనున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి నుంచి గాంధీకి తరలిస్తే చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాద ఘటనపై శనివారం మృతురాలి చిన్నకూతురు పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడిని మంగళవారం నాటికి కూడా అదుపులో తీసుకోలేదు. బైక్‌ను కూడా స్వాధీనం చేసుకోలేదు. ఈ విషయమై నిరసిస్తూ మంగళవారం సాయంత్రం అంబులెన్స్‌లో ఉన్న మృతదేహాన్ని తీసుకొచ్చి పోలీస్ స్టేషన్ ఎదుట బంధువులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. నిందితుడికి కొమ్ముకాస్తున్నారంటూ ఎస్ఐ నవతగౌడ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అతనికి సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బందోబస్తుకు వచ్చిన తూప్రాన్ ఎస్ఐ శివానందం, శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి, వెల్దుర్తి ఎస్ఐ నవతగౌడ్‌లు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీనివ్వడంతో శాంతించి ఆందోళన విరమించారు.

తండ్రిని కడతేర్చిన కొడుకు

● ఖర్చులకు డబ్బులివ్వలేదని గొడ్డలితో దాడి
● ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూత



మారుతి (ఫైల్)

కంగ్టి(నారాయణఖేడ్): జన్మనిచ్చిన తండ్రిని కొడుకు కడతేర్చిన విషాదకర సంఘటన కంగ్టి మండలం చౌకన్‌పల్లిలో మంగళవారం చోటుచేసుకొంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన ఎం.మారుతి(62), చంద్రమ్మ భార్యాభర్తలు. కుమారుడు నర్సప్ప(22) ఉన్నాడు. మారుతి కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా కొడుకు తరుచుగా ఖర్చులకు డబ్బులు అడుగుతుంటే నిరాకరిస్తున్నాడు. ఇంటి పెత్తనం కోసం ఎప్పుడూ కూడా గ్రామ పెద్దల వద్ద పంచాయితీకి తీసుకెళ్లేవాడని స్థానికులు తెలిపారు. కాగా, మంగళవారం చేలో పనులకు వెళ్లి వచ్చిన తండ్రి ఇంట్లో కూర్చొని అల్పాహారం తింటూ పని చేసేందుకు ఎందుకు రాలేదని కొడుకును అడిగాడు. మొహర్రం పండగ ఉందని తాను రానని చెప్పి డబ్బులివ్వాలని అడిగితే మారుతి కట్టెతో మందలించాడు. తండ్రీకొడుకులను గొడవ పడుతుంటే చంద్రమ్మ ఇద్దరిని విడదీసింది. దీంతో కోపోద్రిక్తుడైన నర్సప్ప క్షణికావేశంలో అక్కడే ఉన్న గొడ్డలితో తండ్రి తలపై దాడి చేశాడు. దీంతో తీవ్రగాయమైన అతడిని కుటుంబీకులు వైద్యం కోసం 108లో కంగ్టి పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడి వైద్యులు సంగారెడ్డి జిల్లా హాస్పిటల్‌కు రిఫర్ చేయగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



సుమన్‌ను సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ పూర్ణిమా

దేశ ఔన్నత్యానికి విద్య దోహదం

సినీ నటుడు సుమన్

కొండపాక(గజ్వేల్): సంస్కృతి విలువలతో కూడిన విద్య దేశ ఔన్నత్యానికి దోహదపడుతుందని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. కొండపాక శివారులో సత్యసాయి ప్రశాంతి నికేతన్ మహిళా కళాశాల ఆవరణలో మంగళవారం వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి దివ్య భారతిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు లేని నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్య, వైద్యం, పోషకాహారం అందిస్తున్న ప్రశాంతి నికేతన్ సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో బాలికలకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ సంస్కృతీ సాంప్రదాయాలకు అనుగుణంగా విద్యతో పాటు కళలు, సంగీతం తదితర అంశాలను అందిస్తూ ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న సద్గురు మధుసూదనసాయి లక్ష్యం గొప్పదన్నారు. ప్రశాంతి నికేతన్ వంటి కళాశాల సంస్థలకు ధనికులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇక్కడ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కులమతాలకతీతంగా కళాశాల నిర్వహించడాన్ని కొనియాడారు. అనంతరం కళాశాల చైర్మన్ దంపతులు పూర్ణిమా శంకర్‌ల చేతుల మీదుగా సుమన్‌ను సన్మానించారు. అంతకు ముందు విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురినీ అలరించాయి. కార్యక్రమంలో ఎకడమిక్ కోఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్ పర్సన్ రేష్మ కుందన్, మానస, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్‌కు రేషన్ బియ్యం

● తనిఖీల్లో 550 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
● ఇద్దరు డ్రైవర్ల అరెస్టు



నారాయణఖేడ్: పట్టుబడిన లారీలు, నిందితులను చూపుతున్న ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి

నారాయణఖేడ్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు ఇద్దరిని అరెస్టు చేశారు. ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ డీటీ మహేశ్ కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు లారీల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు సంగారెడ్డి–నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారిపై నిజాంపేట్ మండల కేంద్రం వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న రెండు లారీలను ఆపి తనిఖీ చేశారు. 550 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. విలువ ప్రభుత్వ ధర ప్రకారం రూ.12 లక్షల వరకు ఉంటుంది. పంచనామా నిర్వహించి ఖేడ్ మండలం జూకల్ శివారులోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లో బియ్యాన్ని డంపు చేసి లారీలను సీజ్ చేశారు. డ్రైవర్లు నాందేడ్‌కు చెందిన బాలాజీ, జుబేర్‌లను అరెస్టు చేశారు. వీరిపై క్రిమినల్ కేసును, పౌరసరఫరాలశాఖ డీటీ 6ఏ కేసును పోలీసులు నమోదు చేశారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం హద్నూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. మండల పరిధిలోని చాల్కి చౌరస్తా నిర్వహిస్తున్న తనిఖీలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీదర్ జిల్లాలోని తాద్‌లాపూర్‌కు చెందిన సునీల్‌కుమార్ వాటిని వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం బియ్యాన్ని పౌర సరఫరాల శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ గ్రామ శివారులో ఉన్న సాయిగీత రైస్ మిల్లులో మంగళవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రైస్ మిల్లుకు వచ్చిన సీఎంఆర్ ధాన్యానికి, బియ్యానికి వ్యత్యాసం ఉందనే సమాచారం మేరకు ఈ తనిఖీలు చేశారు. ఈ విషయమై తాము లోతుగా విచారణ జరుపుతున్నామన్నారు. తరుగు ఎంతో తేలితే ఆ తర్వాత రికవరీ చేయొచ్చన్నారు. వారి వెంట తహసీల్దార్ రజనీకుమారి, ఇతర అధికారులు ఉన్నారు.

టాస్క్‌ఫోర్స్, పోలీసుల దాడులు

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం మర్కూక్ పోలీసులతో కలిసి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు కిరాణా దుకాణాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని కర్కపట్లలో మోహన్‌లాల్, మహేందర్ నిర్వహిస్తున్న కిరాణా షాపులో తనిఖీ చేసి రూ.16 వేల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో గుట్కా ప్యాకెట్లు, మద్యం, గంజాయి, డ్రగ్స్ అమ్మివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు, మహిళ మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బంధువు చనిపోతే అంత్యక్రియలకు వెళ్తూ.. రోడ్డు ప్రమాదం బారిన పడి భార్య మృతిచెందాడు. భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదుట మంగళవారం చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మెహిదీపట్నంకు చెందిన భార్యాభర్తలు మహమ్మద్ అబ్దుల్ రహీం (65), రెహానా బేగం(58) కర్నాటకలోని చిద్రూప్పలో బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు కారులో బయలుదేరారు. సదాశివపేట మండలం మద్దికుంట శివారులో గల ఎంఆర్ఎఫ్ పరిశ్రమ వద్ద రోడ్డు పక్కకు ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను సంగారెడ్డిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ రెహానా బేగం(58) మృతిచెందింది. రహీంను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయ రహదారిపై ప్రమాదం



పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

సంగారెడ్డి: ఆటోను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చౌటాకూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పుల్కల్ పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి నుంచి జోగిపేట వైపు ఆటో వెళ్తోంది. శివంపేట వద్ద నాందేడ్ –అకోలా జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న మిన్పూర్ గ్రామానికి చెందిన దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. కార్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఇక్కడికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన కారు

జిన్నారం(పటాన్‌చెరు): కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జిన్నారం వైపునకు వస్తున్న కారులో గడ్డమీది శ్రీనివాస్, అతని భార్య లావణ్య, బంధువు మాధవి ఉన్నారు. మంగంపేటకు వెళ్లి తిరిగొస్తుండగా ఓ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఒక వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దిగి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గాయపడ్డ వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కారు రూపంలో కబళించిన మృత్యువు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో మహిళ మృతిచెందింది.ఈ ఘటన మండలంలోని శనిగరం గ్రామశివారులో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బెజ్జంకి మండలం రేగులాపల్లికి చెందిన కొమ్మరలక్ష్మి (64) చిగురుమామిడి నుంచి ఆటోలో సొంతూరుకు వస్తుండగా.. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అతివేగంతో ఆటో వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడి లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతిరాలి భర్త రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బీరంగూడలో ఎస్ఎస్ వైన్స్ వద్ద రెండేళ్లుగా ఒక గుర్తు తెలియని వ్యక్తి ఇక్కడ మద్యం తాగేందుకు వచ్చే కష్టమర్లకు మందు సీసాలు తెచ్చిస్తూ టిప్పు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14న రాత్రి వందనపురి కాలనీ రోడ్ నంబర్ 8 లో వర్షంలో తడుస్తూ రోడ్డుపై అతను పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు ఉదయం మృతిచెందాడు. మృతుడి కోసం పోలీసులు వైన్స్ షాప్ వద్దకు వచ్చి ఆరా తీస్తే మృతుడి పేరు మల్లేశ్ అని చెప్పడని ఓ తోపుడు బండి చిరు వ్యాపారి తెలిపాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్లు తాగొద్దన్నందుకు ఆత్మహత్య

దుబ్బాకరూరల్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలం బొప్పాపూర్‌లో జరిగింది. ఎస్ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వనమ పర్సరాములు (51) రోజూ కల్లు తాగొచ్చి భార్య, పిల్లలతో గొడవ పడుతున్నాడు. ఈ విషయాన్ని పెద్ద మనుషులకు భార్య తెలిపింది. ఇక నుంచి తాగొద్దు ఇంట్లో గొడవ చేయకూడదని భర్తకు నచ్చజెప్పారు. ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లి రాత్రి అవుతున్నప్పటికీ తిరిగి రాలేదు. ఎన్ని సార్లు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడం లేదు. బంధువుల వద్ద, చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం అతని కుమారుడు అనిల్‌కు గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం పక్కన చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.